# వలస కాలంనాటి 'రాజద్రోహ' చట్టాన్ని రద్దుచేయాలి

**మనం** ప్రజాస్వామ్యపాలనలో జీవిస్తున్నామా లేక వలసపాలకుల కాలంనాటి నిర్బంధం, అణచివేతల కాలంలో వున్నామా అని చూసుకో వలసిన పరిస్థితులు వచ్చాయి. రాజ్యాంగం ద్వారా కల్పించబడ్డాయని చెప్పుకునే స్వేచ్ఛలు, హక్కులన్నీ వాస్తవం కాదని, అవన్నీ ప్రజల్ని నిలువునా దగా చేయటం కోసమేనని మనకు స్పష్టమౌతోంది.

గత కొన్ని సం॥లుగా మన అనుభవాలన్నీ ప్రజాస్వామ్య పాలన అని పాలకులు పదేపదే పేర్కొనేదాన్ని అసహాస్యంచేస్తూ, నియంతల కాలంనాటి పాలనను గుర్తుతెస్తున్నాయి.

బిజెపితో, దాని అనుయాయులతో విబేధించే వారెవరైనా రాజద్రోహం వంటి తప్పుడు కుట్రకేసులలో ఐపిసి 121, 123 సెక్షన్లక్రింద ఇరికించబడతారు. ప్రభుత్వ విధానాలను, ప్రభుత్వ అభిప్రాయాలను విమర్శించే వారిపై లేదా వ్యతిరేకించే వారిపై అత్యుత్సాహంతో రాజద్రోహ నేరంపై కేసులు బనాయించేందుకు పోలీసులకు అనుమతినిచ్చారు.

2019 జనవరిలో సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అస్సామీ సాహితీవేత్త హిరేన్ గోహైన్; ఆర్‌టిఐ కార్యకర్త అఖిల్ గొగొయ్, క్రియాశీల జర్నలిస్టు మంజిత్ మహంతాలపై రాజద్రోహ నేరంపై కేసులు బనాయించారు. వీరు చేసిన నేరం – అస్సామ్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న జాతీయ పౌరసత్వ జాబితా బిల్లుపై వ్యాఖ్యానించటమే! వీరిపై రాజద్రోహం నేరం మోపడాన్ని అస్సామ్ ప్రజానీకం, దేశ వ్యాపితంగా ప్రజాతంత్రవాదులు ఖండించారు. పౌరసత్వ(సవరణ)బిల్లు–2016కు వ్యతిరేకంగా అస్సామ్ ప్రజల గొంతులను పైకి రానీయకుండా అణగద్రొక్కేట్లయితే, వానిని కేంద్రం నిర్లక్షం చేసేట్లయితే, తమకు సార్వభౌమాధికారం లేదా స్వయం ప్రతిపత్తి కావాలనే డిమాండ్లు వారి నుండి తెలత్తుతాయని పై వక్తలు ఓ బహిరంగ సభలో హెచ్చరించటమే తాము వారిపై కేసులు బనాయించటానికి ప్రాతిపదిక అని పోలీసులు పేర్కొన్నారు.

2019 జనవరిలోనే జెఎన్‌యుకు చెందిన ముగ్గురు మాజీ విద్యార్థులపై, ఏడుగురు ఇతరులపై రాజద్రోహనేరం, కుట్ర సెక్షన్లపై కేసులు నమోదు చేశారు. వీరంతా జెఎన్‌యులో విద్యార్థులుగా నున్న కాలంలో మూడు సం॥ల క్రితం జరిగిన ఓ ప్రదర్శనలో వారిచ్చిన నినాదాలు దేశ వ్యతిరేకంగా వున్నాయనే కారణంతో వీరిపై ఇప్పుడు కేసు బనాయించారు – అదికూడా రాజద్రోహ నేరంపై!

ఈవిధంగా దేశ వ్యతిరేకులు అని ముద్రలు వేయటంచాలా సాధారణమైపోయింది. రాజ్యం లేదా ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజావ్యతిరేక చర్యలను, విధానాలను ఆమోదించని ప్రతి ఒక్కరూ దేశవ్యతిరేకులేనన్నమాట!

తిలక్, గాంధీ వంటి జాతీయోద్యమ నాయకులపై నాటి వలసవాద ప్రభుత్వం 150 సం॥ల క్రితం రాజద్రోహ నేరాన్ని ప్రయోగించింది. వారు ఆనాడు స్వాతంత్ర్యాన్ని డిమాండ్ చేసినందుకు వారిపై కేసు మోపారు. నేటి బిజెపి పాలకులు భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసే వారిని నేరస్థులుగా చిత్రించటానికి వారి చేతిలో ఈ చట్టం ఆయుధంగా వుంది.

ఇప్పుడున్న కార్మిక చట్టాలన్నీ కాలం చెల్లినవని, వాటిని అన్నీ నేటి పరిస్థితుల కనుగుణంగా సవరించాలి లేదా రద్దుచేయాలని డిమాండ్ చేసే పాలకులు, అదే రాజద్రోహ చట్టం వంటి వలస పాలకుల కాలంనాటి దానిని రద్దు చేయాలనేసరికి దానికి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు; అందుకు సిద్ధంకారు. ఇది వారి వంచనాత్మక, నిరంకుశ వైఖరులను వెల్లడి చేస్తోంది.

ఈ చట్టాన్ని రూపొందించిన బ్రిటిష్ పాలకులే, నేడు తమ చట్టాలనుండి 'రాజ ద్రోహ'న్ని రద్దుచేశారు. కానీ, బిజెపి పాలకులు ఈనాటికి కూడా 'స్వతంత్ర' భారతదేశాన్ని అదే చట్టం సాయంతో పాలన సాగించాలని చూడటం సిగ్గుచేటైన విషయం.

2017 జులై నాటికి గడిచిన 3 సం॥ల కాలంలో రాజద్రోహ నేరంపై దేశవ్యాపితంగా 165 కేసులు బనాయించారు. ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలు ఎంతటి ప్రమాదకర పరిస్థితుల నెదుర్కొంటున్నాయో ఈ అంశం మనకు స్పష్టంచేస్తోంది.

పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, దేశవ్యతిరేక విధానాల ఫలితంగా, దేశంలోని అన్నిరంగాల ప్రజానీకం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నారు. దీనిని పరిష్కరించజాలని పాలకులు రాజ్యహింసను ప్రయోగించి, ప్రజల న్యాయమైన ఆకాంక్షలను, డిమాండ్లను అణచి వేస్తున్నారు. ఈవిధంగా అణచివేయటానికి వారి చేతిలోనున్న మరో అస్త్రమే–రాజద్రోహ చట్టం.

ఈవిధమైన నిరంకుశాధికార పాలనను సహించరాదు. దేశవ్యాపితంగా ప్రజాస్వామిక శక్తులన్నీ ఐక్యంగా కనీసపాటి స్వేచ్ఛలను కూడా హరిస్తున్న ఈ నిర్బంధం, అణచివేత విధానాలకు వ్యతిరేకంగా పోరాడటానికి సమాయత్తంకావాలి.

೦೦೦೦